# సాడిస్టు

—వెల్లపిల్ల బాబ్జీ

మనుషుల్లో సామాన్యంగా వుండే వాళ్ళ నొదిలేస్తే మిగతావాళ్ళని మూడు రకాలుగా విభజించవచ్చు

—ఎదుటి వ్యక్తుల్ని బాధపెట్టి, వాళ్ళు ఏడుస్తుంటే చూసి ఆనందించేవాళ్ళు మొదటి రకం. వీళ్ళనే 'సాడిస్టు' అంటారు. ఎదుటివాళ్ళు ఆనందంగా వుంటే చూసి ఓర్వలేనివాళ్ళు రెండోరకం. వీళ్ళు అసూయాపరులు. తమని తాము బాధపెట్టుకుంటూ, ఆ బాధలో ఆనందం పొందేవాళ్ళు మూడోరకం. వీళ్ళని 'మసోఛిస్టు' అంటారు.

వీళ్ళలో రెండు, మూడు రకాలకు చెందే వారివలన ఎదుటివాళ్ళకు కష్టం కలగదు.

కానీ—రాజు మొదటి రకానికి చెందే—'సాడిస్టు.'

సూర్యం ఏ రకానికీ చెందని సామాన్యుడూ పిరికివాడూ. అంతేగాక అతను రాజుకి మిత్రుడూ, రూమ్మేటూను.

మరంచేత రాజు వలన సూర్యానికి కష్టాలు తప్పటం లేదనేది—రాజు, 'సూర్యాన్ని ఏడిపిస్తూ ఆనందించేటంత నిజం-వాళ్ళు వుంటున్న బొక్కి కొంప వదిలేస్తే, ఆ వూళ్ళో మరిళ్ళు దొరకవన్నంత నిజం.

అంచేత సూర్యం, రాజునొదిలించుకోలేక, మరో చోటుకి వెళ్ళలేక ఎలాగో రోజులు గడుపుకొచ్చేస్తున్నాడు భగవంతుడిమీద భారం వేసి.

సూర్యం పిరికివాడు కాకపోతే ఏదో ఒక 'రెమెడీ'ని వెతుక్కునుండేవాడు. కానీ, సూర్యం బొత్తిగా నాలుక లేనివాడు అవటంతో, రాజు ఆడింది ఆటగా, పాడింది పాటగా, చెప్పింది వేదంగా సాగిపోతోంది.

రోజులన్నీ యిలాగే గడిచిపోతే చాలన్న సంతోషం వుంది రాజుకి!

రోజులన్నీ యిలాగే గడిచిపోతాయేమో అన్న భయం వుంది సూర్యంకి!

తెల్లారితో ఏంచేసి సంతోషిద్దామా!—అని రాజూ, తెల్లారితే ఏం జరుగుతుందో!—అన్న భయంతో సూర్యం—ఏ రోజు కా రోజు గడిపేస్తున్నారు!

చిత్రమేమిటంటే రాజు, సూర్యాన్ని పెట్టే బాధలు తమాషాగా, ఎవ్వరికి చెప్పుకోలేకుండా వుండేవి. రాజు తన సాడిజాన్ని అలా ప్రదర్శించేవాడు.

—చచ్చీ, చెడీ ఆఫీసునుండి యింటికొచ్చేసరికి, ముందే వచ్చివున్న రాజు ఒక్క చుక్కైనా నీరు లేకుండా చేసేవాడు. దిక్కుమాలిన ఆ బొక్కి కొంపలో—ఎక్కడో ఫర్లాంగు దూరంలో నుయ్యుంది. పెరట్లోనూతి కెళ్ళే దారినిండా చెత్తా, చెదారం, చుట్టూ గుబురుగా, భయంకరంగా పెరిగిన పిచ్చిమొక్కలూ, పట్టపగలే దెయ్యాలు గెంతేటంత దారుణంగా వుండే పెరడూ. కొళాయిలు రాని టైము..

స్వతహాగా భయస్థుడైన సూర్యం, 'కాస్త తోడురా, రాజూ!' అని ప్రాధేయపడితే, రాజులా పోజుపెట్టేసి 'అలసిపోయానుగురూ!' అనేవాడు రాజు. ప్రాణాలు అరచేత్తో పట్టుకొని ఎలాగో నీళ్ళు తెచ్చుకునేవాడు సూర్యం.

వారంలో రెండు, మూడుసార్లు యిలాగే జరిగేది—

—రాత్రి పడుకోబోయే ముందు వెలిగించిన బెడ్‌లాంప్‌ని, సూర్యానికి నిద్ర పట్టగానే ఆర్పేసేవాడు రాజు. ఓ రాత్రప్పుడు దాహానికో, మరి దేనికో మెలుకువొచ్చిన సూర్యం, చిక్కటి ఆ చీకటిని చూసి వెంటనే ముసుగెట్టేసేవాడు. ఇక నిద్రపట్టి చచ్చేది కాదు..

అలాగే దాహంతోటో, పీకుతున్న పొత్తికడుపుతోటో పడుకునేవాడు. రాజుని లేపినా ఫలితం వుండదని, అతని గుర్రే చెపుతుండేది.

ఇంక—తెల్లారి లేచేసరికి వొంటిమీద

లుంగీ లేకపోవడం, స్నానం చేస్తూ ముఖానికి సబ్బు రాసుకున్నప్పుడు అకస్మాత్తుగా చెంబు మాయమైపోవడంలాంటి అనుభవాలు చాలా మామూలైపోయాయి సూర్యానికి.

గట్టిగా యేమైనా అంటే నాలుగురోజులు మాట్లాడేవాడు కాదు రాజు. ఆ తర్వాత పరిస్థితుల్ని భరించటం యింకా కష్టంగా వుండేది సూర్యానికి. రాజు సాడిజాన్ని అలా కొనసాగించాడు. కొనసాగిస్తున్నాడు.

కానీ రోజులన్నీ అలాగే జరిగిపోలేదు.

ఒకరోజు

* * *

ఆ రోజు సరిగ్గా రాత్రి ఒంటిగంటయ్యింది. దేవుడే గెలిచాడు సినిమా చూసిన రాజూ, సూర్యం రోడ్డుమీదికొచ్చారు. అంతకు ముందు రోజే స్వంత వూరు నుండి తిరిగొచ్చిన సూర్యాన్ని బలవంతాన లాక్కొచ్చాడు రాజు, సెకండ్ షోకి.

ఆఖరురోజు కావటంవల్ల జనం అంతగా లేరు. వచ్చిన కొద్దిమందిలో చాలా మట్టుకు రిక్షాలమీదా, సైకిళ్ళమీదా వెళ్ళిపోయారు. నాలుగువైపులా వున్న రోడ్లమీదికి మిగతా జనం చెదురు మదురైపోయారు.

కిళ్ళీబడ్డీ దగ్గర సిగరెట్లు కొనుక్కొని వచ్చాడు రాజు.

"ఇలా పోదాం, అడ్డదారంట!" అంటూ రాజు కుడివైపుగా వున్న రోడ్డువైపు, దారి తీసాడు రాజు.

సూర్యం నెమ్మదిగా రాజు ననుసరించాడు.

ఆ రోడ్డంతా నిర్మానుష్యంగా వుంది నిశ్శబ్దంగా వుంది చీకటిగా వుంది. ఆ వీధి కసలు దీపాలే లేవు దానికి తోడు చీకటి రాత్రుళ్ళు.

చిక్కగా అలుముకున్న చీకటి—సూర్యం మనసు నావరించిన భయంలా వుంది రాజు మనస్తత్వంలా అసహ్యంగా వుంది.

కీచురాళ్ళ అరుపులు కర్ణకఠోరంగా వున్నాయి

ఎక్కడో పిట్ట రెక్కలాడిస్తున్న చప్పుడు వినిపించి, మళ్ళీ నిశ్శబ్దం అలుముకుంది

ఇద్దరూ మౌనంగా నడుస్తున్నారు

అస్పష్టంగా కనిపిస్తున్న చెట్లు, నించునే నిద్రపోతున్న రాక్షసుల్లా వున్నాయి

చెట్ల మధ్యనుండి అక్కడక్కడ కనిపిస్తున్న ఆకాశంలోని చుక్కలు రెప్పలార్చుకుంటూ చూస్తున్న దెయ్యాల కళ్ళలా వున్నాయి

ఏదో పక్షి, చెట్టు కొమ్మల్లోంచి వికృతంగా అరిచింది!

వెనక్కు దాటిపోతున్న పొడుగాటి చెట్లు, జుత్తు విరబోసుకున్న దెయ్యాల్లాగా వున్నాయి

" ఫొటోగ్రఫీ అద్భుతం గురూ!" సడన్‌గా నిశ్శబ్దాన్ని చీలుస్తూ వినపడ్డ రాజు మాటలకు తుళ్ళిపడ్డాడు సూర్యం.

"ఆఁ?" అన్నాడు సూర్యం—సరిగా వినపడక. అతని గుండెలు జోరుగా కొట్టుకుంటున్నాయి.

"దెయ్యాన్ని గొప్పగా పిక్చరైజ్ చేసాడు కదూ!"

అస్పష్టంగా తలూపి వూరుకున్నాడు సూర్యం. అతనికి ఆ సంభాషణ యిష్టంలేదు. ఆ సంగతి రాజుకు తెలుసు.

అదే సాడిస్టుల లక్షణం—ఎదుటివారికి పడనివి తెలుసుకుని, తర్వాత బాధ పెట్టడం.

"నువ్వెప్పుడైనా దెయ్యాన్ని చూశావ్, గురూ?" మళ్ళీ అన్నాడు రాజు.

సూర్యం లేదన్నట్లు నెమ్మదిగా తలాడించాడు.

"మా వూళ్ళో వుండేదిట, గురూ! రోజూ రాత్రి పన్నెండింటికి, వూరి చివరన వున్న చింతచెట్టు చిటారుకొమ్మ మీద కూర్చునేదట" రాజు కనుకొలుకుల్లోంచి సూర్యాన్ని ఓరగా చూస్తూ అన్నాడు — గొంతు అదోలా మారుస్తూ.

సూర్యానికి ఒక్కసారి వొళ్లు జలదరించింది!! తన యెదుటనే ఆ చింతచెట్టు వున్నట్టు వొణికిపోయాడు!!!

తో౦గడి

"కాస్తాగు గురూ!" అంటూ, పేంటు గుండీ లిప్పుకుంటూ రోడ్డుపక్కకు నడిచాడు రాజు.

రోడ్డు ప్రక్కనే వున్న దుంగొకటి— యుద్ధరంగంలో చచ్చిపోయిన రాక్షసుడిలా— వుంది

రాజు నోట్లో ఎర్రగా వెలుగుతున్న సిగరెట్టు పిశాచి ఒంటికన్నులా వుంది.

కొంచెం సేపటి తర్వాత రాజు వచ్చాడు. మళ్ళీ యిద్దరూ నడక ప్రారంభించారు. చిన్న చలిగాలి వీస్తోంది.

"దెయ్యాలున్నాయి గురూ! లేకపోతే మనం చూసిన సినిమా—, అలా తీసే ఐడియా వాళ్ళకు రాదు."

దెయ్యాలమీదికి మళ్ళిన రాజు సంభాషణ, కట్టు కథల్తో సాగుతోంది.

మౌనంగా వినటం తప్ప ఏమీ చెయ్య లేని సూర్యం, నిస్సహాయంగా నడుస్తు న్నాడు

రాజు చెబుతున్న విషయాలు వినేకొద్దీ, సూర్యం గుండెలు కొట్టుకొనే వేగం పెరిగి పోతోంది! చెమటతో చొక్కా అంతా తడిసి పోతున్నట్టు స్పష్టంగా తెలుస్తోందతనికి!

ఎక్కడో కుక్క ఒకటి వికృతంగా



ఏడ్చింది!! చిన్నపిల్లాడు నూతిలో పడిపోతూ హృదయవిదారకంగా అరిచినట్టుంది — ఆ ఏడుపు.

వింటున్న సూర్యం గుండెలు ఝల్లు మన్నాయి!!

"గాలిలో దెయ్యాలు తిరుగుతుంటే కుక్కలు పసిగట్టి అలా ఏడుస్తూ అరుస్తా యట!!" అన్నాడు రాజు.

సూర్యం భయంతో ఒక్కసారి చుట్టూ చూసాడు—అసంకల్పితంగా.

గాలి గట్టిగా వీచిందొక్కసారి—దెయ్యాల గుంపు పరిగెడుతున్నట్లు.

చెట్ల ఆకులు గల గలమంటూ చప్పుడు చేశాయి—దెయ్యాల కాలి మువ్వల్లా.

"భయం వేస్తోందా?" అడిగాడు రాజు లోపల నవ్వుకుంటూ. అతనికి భలే ఆనందంగా వుంది.

సూర్యం మాట్లాడలేదు.

మెల్లగా నడుస్తూ, కుడిప్రక్కనున్న సందు లోకి తిరిగారు. ఆ సందు దాటితే వచ్చేదే వాళ్ళ వీధి. నెమ్మదిగా సందు దాటుతున్నారు.

'భయంవేస్తోందా?' మళ్ళీ అన్నాడు రాజు.

జవాబు చెప్పటం యిష్టంలేనట్లు వూరుకొని, 'దాహం వేస్తోంది' అన్నాడు సూర్యం.

సందు దాటగానే కొద్దిదూరంలో, కుడి ప్రక్క ఎర్రగా వెలుగుతూ చిన్న మంట కనిపించింది.

అదొక కిరసనాయిలు దీపం బుడ్డీ. ఆ బుడ్డీ వున్నచోటు అప్పిగాడి టీ పాక. అప్పిగాడు గల్లాపెట్టి సర్దుతున్నాడు.

'కొట్టింకా కట్టినట్టులేదు. రా టీ తాగుదాం!' అంటూ పాకలోకి దారితీశాడు రాజు.

'అప్పీ! మంచినీళ్ళిచ్చి, రెండు సింగల్ టీ కొట్టించు' ఆర్డరిచ్చాడు రాజు, బెంచిమీద కూర్చుంటూ. సూర్యం ప్రక్కనే వచ్చి కూర్చున్నాడు.

'ఏం-రాజు బావ్! చినీమా కెళ్ళినారేటి?' పలకరించాడు అప్పిగాడు. ఆ వెంటనే ఆవులించాడు. మధ్య పళ్ళూడిన వాడి నోరు రాక్షసుడి గుహలా తెరుచుకుని మూసుకుంది. దీపం వెలుతురు పడి వాడి కళ్ళు - స్మశానంలో గుడ్లగూబ కళ్ళలా మెరిసాయి. చీకేసిన తాటి టెంకలా వుంది వాడి బుర్ర. వెడల్పుగా వున్న వాడి ముఖంలో ముక్కు వుందో - లేదో తెలీనంత చప్పిడిలా వుంది. సగం కాల్తూనప్పుడు ఆర్పేసిన శవంలా వుంటాడు వాడు. వాడి ఎదురుగా వున్న కుంపటి, చచ్చినవాడి పాడెముందు మోస్తున్న నిప్పుకుండలా వుంది. ఎక్కువ పొగనొదుల్తూ మండుతున్న దీపశిఖ, మొగుడు చచ్చిన ఆడదాని సగం చెరిపేసిన నుదుటి కుంకుమలా వుంది.

కుంపట్లో బొగ్గులు కదిపి చిన్న డొక్కుతో నీళ్ళు పడేసి, గట్టిగా విసిరాడు అప్పిగాడు. కుంపటి రాజుకుంటోంది మెల్లగా.

గ్లాసుల్లో నీళ్ళిస్తూ "ఏం చినిమా కెళ్ళినారు బావ్?" అన్నాడు అప్పిగాడు. వచ్చిన బేరాన్ని కూర్చోబెట్టి ఎంతసేపైనా మాట్లాడే నేర్పుంది అప్పిగాడికి. వాడి గొంతులో అదో రకమైన మాధుర్యం వుంది.

హనుమంతుడికి తాటకినిచ్చి పెళ్ళి చేసినట్లుంది-వాడి గొంతు వాడి రూపానికి.

రాజు జవాబిచ్చాడు. సూర్యం గడగడా నీళ్ళు తాగాడు

"సిన్నప్పుడు మా తాత సెప్పిందానికి, ఆడు తీసిందానికి రవ్వంత తేడానేదు బావ్!! నాకు తెలకడుగుతాను—ఆడెలా తీసినాడు బావ్? నిజంగా దెయ్యాంవేం నంటారేటి?" టకటకా అన్నాడు అప్పిగాడు.

"కాదులే అదీ! ట్రిక్ ఫోటోగ్రఫీ అని కెమేరాతో అలా తియ్యగలరు" అన్నాడు రాజు.

"ఏం ఫొటోగెరపో గానీ మా గొప్పగా తీసినాడు. ముచ్చెంగా దెయ్యాంవేం బావ్!"

"ఓస్! నువ్వు చూసావేంటి దెయ్యాన్ని?"

"సూడ్నేదు. కానీ, మా తాత సెప్పినాక మరి సూడక్కర్నేదనిపించింది బావ్! నిజం... సెంద్రిగోడని " ఉత్సాహంగా గతంలోకి వెళ్ళిపోయాడు అప్పిగాడు.




వాళ్ళ తాత చెప్పిందంతా, తనే కళ్లారా చూసినట్టు చెప్తూనే టీ కలిపేసాడు.

'అది బావ్! చివరికి సంగతేటంటే ఆ ఆడ దెయ్యాన్ని మరిగాక, ఆడుకూడా సచ్చి దెయ్యఁవై, కుటుఁవాఁనంతో సహా మా యీది రావిసెట్టుమీద కాపరఁవెట్టేసినాడంట అద్ద రేతిరయ్యేసరికి, ఆ రావిసెట్టు కొమ్మ మద్దె నుండి రెండు కాళ్ళు యేలాడేవంట! ఏ నాకొడు కైనా తెగించి ఆ యీదంట ఒక్కడూ వత్తే, ఈ పాదాఁరెండూ అడి పీకను జుట్టేసి, రాక్కున నొక్కేసేవంట!!" అంటూ టీతెచ్చి యిద్దరిముందూ పెట్టాడు అప్పిగాడు.

తల టేబిల్మీద వాల్చి పడుకుని వింటు న్నాడు సూర్యం! వెనక, గోడకు జారబడి, రాజుకూడా సీరియస్గా వింటున్నాడు! వాళ్ళ నరాలు చిట్లిపోతాయన్నంత టెన్షన్లో వున్నాయి! తరువాత ఇద్దరూ టీతాగి డబ్బులిచ్చి బయటకొచ్చారు.

ఎంచేతో రాజు రూమ్ చేరినదాకా మరేం మాట్లాడలేదు.

లుంగీలు కట్టుకుని యిద్దరూ నిద్రకుపక్ర మించారు. సూర్యాన్ని భలే ఏడిపించాను అను కుంటూ నెమ్మదిగా కళ్ళు మూసుకున్నాడు రాజు కానీ అతని బుర్రలో యింకా అప్పిగాడు చెప్పిందంతా మెదులుతోంది. ఆలోచిస్తూనే పడు కున్నాడు రాజు, మూలగా వెలుగుతున్న బెడ్ లాంప్ని చూస్తూ

* * *

హఠాత్తుగా మెలుకువొచ్చింది రాజుకి. ఏదో పెద్ద కొండపైనుండి ఒక్కసారి క్రింద పడినట్లనిపించింది.

సందేహంలేదు! తనేదోచప్పుడు విన్నాడు!! రాజు యింకా ఆలోచిస్తున్నాడు 'టక్!టక్!' మంది వీధి తలుపు!

రాజు గుండెలు ఒక్కక్షణం ఆగి, వెంటనే జోరుగా కొట్టుకున్నాయి!! 'ఈ వేళప్పుడెవరు చెప్మా!!!?'

మళ్ళీ టక్! టక్ మంది వీధి తలుపు-ఈ సారి కొంచెం గట్టిగా.

రాజు గొంతు తడారిపోయింది. సూర్యం వైపు చూసాడు. సూర్యం అటు తిరిగి నిద్ర పోతున్నాడు.

మరోసారి తలుపు చప్పుడవడంతోబాటు 'సూర్యం!' అని ఓ బొంగురు గొంతు విని

పించింది.

రాజు నెమ్మదిగా లేచి స్విచ్ వేసాడు. కరంటు పోయినట్టుంది. బల్బు వెలగలేదు. బెడ్ లాంప్ ఒత్తి పెద్దదిచేసి చేత్తో పట్టుకుని వెళ్ళి గడియ తీసాడు.

ఎదురుగా ఎవరో అపరిచిత వ్యక్తి!!

అతని నీడ గోడమీద పెద్దదిగా పడి భయంకరంగా కదులుతోంది.

"నేను సూర్యం అన్నయ్యకి ఫ్రెండ్ని, సూర్యం వున్నాడా?" అంటూ లోపలి కడు గేసాడు అతను. డబ్బాలో గులకరాళ్ళు వేసి కుదిపినట్టు బొంగురుగా వుందతని స్వరం.

రాజు అప్రయత్నంగా దారి తొలిగాడు.

ఆ క్రీనీడలో చితిమీంచి లేచొచ్చిన టీబీ పేషెంటులా వున్నాడతను చెంపల మీది చర్మాన్ని చెవులదగ్గరికి లాగి పట్టినట్లు, వికృతంగా వుందతని ముఖం కళ్ళు మరీ లోతుకు వెళ్ళిపోయాయి మెడదగ్గర ఎముకలు ముందుకు పొడుచుకొచ్చి, అసహ్యంగా వున్నాయి ముక్కు బాగా ముందుకొచ్చి, ఇంక రాలేక క్రిందికి వాలిపోయినట్టుగా వుంది. అస్థిపంజరానికి అలంకారం చేసినట్టున్నాడతను.

'అతను' పూర్తిగా లోపలకు రాగానే చటుక్కున లైటు వెలిగింది. వెలుతురును చూసాక రాజు గుండె వేగం కొంచెం తగ్గింది.

'అతను' రాజువైపు చూసాడు-అదోలా.

కుటుంబాన్నంతటినీ తన చేతుల్తోటే తగలెట్టేసిన వ్యక్తి 'యింకా ఎవరున్నారా!' అని వెతికినట్టుంది ఆ చూపు, నిర్దాక్షిణ్యంగా.

రాజు వెళ్ళి సూర్యాన్ని కుదిపి లేపాడు.

"చూడు! మీ అన్నయ్య ఫ్రెండెవరో వచ్చారు!'' మరోసారి కుదుపుతూ అన్నాడు రాజు.

- సూర్యం కళ్ళు నులుముకుంటూ గట్టిగా ఆవలించి, అయోమయంగా ఆ వ్యక్తి వైపు చూసాడు.

"మీరూ . "అంటూ సందేహంగాఆగాడు.

"కృష్ణారావుని. మి అన్నయ్య ఫ్రెండ్ని. మీ యింటి కెదురుగా వున్న పచ్చమేడలో, మీ వూళ్ళో వుండేవాడిని" నవ్వాడతను.

'ఆఁ ఆఁ రండి!' గుర్తొచ్చినట్టు అన్నాడు సూర్యం.

'చిన్న పనిమీద వచ్చాను. ఆఖరి బస్సు మిస్సయితే 'దేవుడే గెలిచాడు' సెకండ్ షో చూసాను. మా ఫ్రెండొకాయన యింటికెళ్ళాను. కానీ అతడు లేడు. అంచేత రాత్రి వుండి వుదయం ఫస్టు బస్సు కెళదామని యిలా వచ్చేశాను." అన్నాడతను నవ్వుతూ. వెకిలిగా వుందా నవ్వు.

'ఓ! అలాగా!' అంటూ సూర్యం తన మంచం ఖాళీచేసి అతని కిచ్చాడు.

రాజూ, సూర్యం ఓ మంచంమీద సర్దుకున్నారు.

సూర్యం తాముకూడా ఆ సినిమాకే వెళ్ళినట్టు చెప్పి, ఏదో రెండు మూడు నిముషాలు మాట్లాడి, అలాగే నిద్రలోకి జారిపోయాడు.

అతనింకా మాట్లాడుతున్నాడు రాజుతో. రాజు అలా వింటున్నాడు. అతను సినిమా గూర్చే మాట్లాడుతున్నాడు.

రాజుకి ఏమిటో అతన్నీ, మాట తీరునీ చూస్తూంటే అదోలా వుంది. రాజు సిక్స్త్ సెన్స్ ఏదో చెబుతోంది.'సమ్థింగీజ్' రాంగ్!అంటూ.

మంచంమీద పడుకుని మాట్లాడుతున్న అతను, రాజువైపే చూస్తున్నాడు.

రాజుకు సడన్గా తెలిసింది - అతను రెప్ప వెయ్యటం లేదని. అవును!!! అతను రెప్ప వెయ్యటంలేదు!! రాజు రోమాలు ఒక్కసారిగా నిక్కబొడుచుకున్నాయి దేహంమీద!!

అసంకల్పితంగా అతని పాదాల మీదికి వెళ్ళింది రాజు దృష్టి.

అతను వెంటనే కాలిమడమ గోక్కుంటూ అన్నాడు.

"దెయ్యాలు సిగరెట్లు కాల్చవు కదూ!?"

రాజు ఏమీ అనకముందే "అగ్గిపెట్టె కావాలొకసారి" అంటూ తలగడ క్రింద నుండి సిగరెట్ పెట్టె తీసాడు.

రాజు లేచి అగ్గిపెట్టె తెచ్చి యిచ్చాడు. అతని కాళ్ళు వణుకుతున్నాయి!!

"నిద్రొస్తోందండీ!' అంటూ లైటార్పి వచ్చాడు రాజు.

"అమ్మయ్యా! ఎప్పుడు లైటారిపోతుందా అని చూస్తున్నాను." అతని గొంతు చిత్రంగా ధ్వనించింది.

అదిరిపడ్డాడు రాజు!! తలలో ఏదో అవుతున్నట్లుగా—బుర్రంతా తిరుగుతున్నట్లుగా !!

"అబ్బే! మరేం లేదు. లైటుంటే నాకు నిద్రపట్టి చావదు."

రాజుకు ఎప్పుడు నిద్ర పట్టిందో, ఏమో తెలియలేదు.

* * *

ఉదయం పదిగంటలు కావస్తుండగా ఆఫీసు కెళ్ళబోతున్న సూర్యం రాజుని లేపి "తలుపు వేసుకుని పడుకో నే వెళ్తున్నా!" అంటూ వెళ్లిపోయాడు.

బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ లేచాడు రాజు. ప్రక్క మంచం ఖాళీగా వుంది.

మొహం కడుక్కుని వచ్చేసరికి 'పోస్ట్' అంటూ కేక వినిపించింది. వెళ్ళి పోస్ట్‌మేన్ యిచ్చిన కవరు అందుకున్నాడు. అది సూర్యంది. వాళ్ళన్నయ్య రాసాడు. అయినా రాజు కవరు చించాడు. సూర్యం వుత్తరాలన్నీ అతను చదువుతాడు. ఉత్తరం విప్పాడు రాజు.

ప్రియమైన తమ్ముడు సూర్యానికి!

నీ అన్నయ్య దీవించి వ్రాయునది. అందరం క్షేమంగా వున్నాము. నువ్వు క్షేమంగా వున్నావని తలుస్తాను.

మొన్న నువ్వొచ్చినపుడు చెప్పిన పుస్తకాలకు డబ్బు కట్టేసాను. మొత్తం వందరూపాయలు. పదిహేను రోజుల్లో నీకు పుస్తకాలు వచ్చేస్తాయి. శ్రద్ధగా చదవవలెను.

నేను మళ్ళీసారి వొచ్చినపుడు పచ్చళ్ళు తీసుకుని వస్తాను. అప్పుడు వొండుకుందూ గాని. అందాకా హోటల్ భోజనం నీకు తప్పదు.

మీ వొదిన యింకా రాలేదు. బహుశా రేపు రాత్రికి రావొచ్చు. అమ్మ నాన్నా నీకు ఆశీర్వచనములు పంపుతున్నారు. అందరూ నిన్నడిగినట్టు చెప్పమన్నారు. మరేం విశేషములులేవు.

అన్నట్లు—మనింటికెదురుగా పచ్చమేడలో వుండే, కృష్ణారావు—అదే నా ఫ్రెండు మనింటికి రెండుమూడుసార్లొచ్చాడే పాపం—అతను నిన్న ఉదయం చచ్చిపోయాడు!! క్షయ బాగా ముదిరిపోయిందిలే!!

చదువుతున్న రాజు చేతిలోంచి కవరు ఎగిరి, గాలికి పెరట్లోకి ఎగిరి తుప్పల్లో దూరిపోయింది.

* * *

సరిగ్గా అదే టైముకు అన్నయ్యకు రాసిన వుత్తరాన్ని మరోసారి, పోస్టుచేసే ముందు, చదువుతున్నాడు సూర్యం.

ప్రియమైన అన్నయ్యకు!

సూర్యం నమస్కారములు. నీ పధకం అద్భుతంగా యిప్పటివరకు నడిచింది. రాత్రి కృష్ణారావుగా రొచ్చారు.

లెక్కప్రకారం ఈ పాటికి సరిగ్గా రాజు నువ్వు రాసిన వుత్తరం చదువుతుంటాడు.

నిజంగా కృష్ణారావుగారు రెప్పవెయ్యకుండా వుండటం బాగా ప్రాక్టీస్ చేసారు. మనకి సహాయపడినందుకు ఆయనకు నా తరపున కృతజ్ఞతలు అందచేయవలెను.

అన్ని వివరాలతో మళ్ళీ వుత్తరం వ్రాస్తాను ఇకనుండి రాజు నన్నేడిపించటం మానేస్తాడనుకుంటున్నాను.

వుంటాను. మరి.
నీ తమ్ముడు
సూర్యం.

* * *

రాజు, తరవాత సూర్యాన్నే కాదు—ఎవ్వరినీ ఏడిపించడం మానేసాడు. ప్రస్తుతం ఇంకో వూరు వెళిపోయే ప్రయత్నంలో వున్నాడు. పాపం సాడిస్టు—రాజు.

